కూటమి మోసాలను ఎండగడదాం




సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను పార్టీ శ్రేణులకు వివరిస్తున్న భూమన అభినయ్ రెడ్డి

- తిరుపతి నగర పార్టీ శ్రేణులకు భూమన అభినయ్ రెడ్డి పిలుపు

తిరుపతి మంగళం : నోటికి వచ్చిన అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడుదామని తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయం వద్ద సోమవారం చంద్రబాబు మోసాల మేనిఫెస్టోపై తిరుపతి నగర పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్‌ను భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డితో పాటు పార్టీ శ్రేణులు ఆవిష్కరించారు. అనంతరం చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై భూమన అభినయ్ పార్టీ శ్రేణులకు వివరించారు. గత ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తాము అధికారంలోకి వస్తే ఇదిగో ఇన్ని సంక్షేమ పథకాలు అందిస్తామంటూ బాండ్లు ఇచ్చి మరీ ప్రజలను మోసగించారని తెలిపారు. అధికారం చేపట్టి ఏడాది దాటుతున్నా మేనిఫెస్టోలోని ఏ ఒక్క హామీని సక్రమంగా నెరవేర్చలేదన్నారు. అనంతరం చంద్రబాబు రీకాల్ మేనిఫెస్టోలోని క్యూ ఆర్ కోడ్‌ను ప్రతి ఒక్కరూ స్కాన్ చేసుకుంటే అందులో చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీ ఉంటుందని, వాటిని నగర ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలన్నారు.

అబద్ధాలు తప్ప అమలు చేసింది లేదు..

అనంతరం మేయర్ శిరీష మాట్లాడుతూ చంద్రబాబు అధికారం కోసం నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పడమే తప్ప వాటిని అమలు చేసిన దాఖలాలే లేవన్నారు. ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను యథావిధిగా కొనసాగించారన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తే వారే కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు.

అవగాహన

తిరుపతి కల్చరల్: చైల్డ్ ఫండ్ వారి ఆర్థిక సహకారంతో జిల్లాలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమైక్య సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు మండల సమైక్య సభ్యులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.

ధర్నాలు చేస్తే గానీ స్పందించరా..!

తిరుపతి తుడా: స్థానిక సుందరయ్య నగర్, రైల్వేకాలనీలో రోడ్లను తవ్వి అసంపూర్తిగా వదిలేసి ప్రజలకు నరకం చూపిస్తున్న అధికారులు ధర్నా చేస్తే గానీ స్పందించరా అంటూ సీపీఎం నాయకులు మండిపడ్డారు. సోమవారం అసంపూర్తిగా వదిలేసిన రైల్వేకాలనీ, సుందరయ్య నగర్ రోడ్ల వద్ద నగర సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకులు సుబ్రమణ్యం, మాధవ్, బుజ్జి, నరేంద్ర, వేణు, మల్లికార్జునరావు, జయంతి తదితరులు పాల్గొన్నారు.

వెంటనే పూర్తి చేయండి

సీపీఎం నాయకుల ధర్నాతో నగరపాలక సంస్థ అధికారులు దిగివచ్చారు. కమిషనర్ మౌర్య, అధికారుల బృందం సోమవారం సుందరయ్య నగర్, రైల్వే కాలనీలో అసంపూర్తిగా ఉన్న రోడ్లను పరిశీలించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నుంచి అందిన ఫిర్యాదుల మేరకు రోడ్లను పరిశీలించడం జరిగిందని, వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు కమిషనర్ తెలిపారు.



అధికారులతో కలసి రోడ్లను పరిశీలిస్తున్న కమిషనర్

ఇండోర్ స్టేడియం మరమ్మతులకు శ్రీకారం

చంద్రగిరి: స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియం పనులను పునఃప్రారంభించేందుకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే నాని అన్నారు. ఈ మేరకు సోమవారం పనులను ప్రారంభించేందుకు ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాప్ చైర్మన్ రవి నాయుడు, ప్రముఖ హాకీ క్రీడాకారిణి రజని పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సుమారు రూ.1.53 కోట్ల నిధులతో ఇండోర్ స్టేడియం పనులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే ఎదుట సమస్యలు ఏకరువు

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి సర్పంచ్‌లు తమ గ్రామాల్లోని సమస్యలను ఏకరువు పెట్టారు.

అధికారుల అత్యుత్సాహం..

సర్వసభ్య సమావేశంలో మండల అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడంపై ప్రజాప్రతినిధులు మండిపడుతున్నారు. ఎలాంటి ప్రోటోకాల్ నిబంధనలు లేని వ్యక్తులను వేదికపైకి ఆహ్వానించడం ఏమిటంటూ మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఇలాంటి వింతలు ఏనాడూ జరగలేదని, కూటమి పాలనలో అధికారులు కీలుబొమ్మలుగా మారారని ఆరోపించారు.

బాలికల విద్యను భ్రష్టు పట్టిస్తున్న ప్రభుత్వం

తిరుపతి సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో బాలికలకు ఉన్నత విద్య అందకుండా కూటమి ప్రభుత్వం వ్యూహాత్మక కుట్ర చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన విద్యార్థి విభాగం కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కూటమి సర్కార్ హైస్కూల్ ప్లస్ (ఇంటర్ కాలేజీ) విద్యను నిర్వీర్యం చేసేందుకు అందులో పనిచేసే దాదాపు 1000 మంది స్కూల్ అసిస్టెంట్లను బదిలీ చేసి అన్యాయం చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై అక్కసుతో నాటి విద్యాసంస్కరణలను కూటమి రద్దు చేయడం బాధాకరమన్నారు. చంద్రగిరి నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెంగల్ రెడ్డి మాట్లాడుతూ ఈసెట్ ఫలితాలు వచ్చి దాదాపు 45 రోజులు అవుతున్నా ఇప్పటికీ కౌన్సిలింగ్ ప్రారంభించకపోవడం కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. మంత్రి నారా లోకేష్‌కు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడం మీద ఉన్న శ్రద్ధ విద్యాశాఖపైన లేదని విమర్శించారు. సమావేశంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు యశ్వంత్ రెడ్డి, హరీష్, సాయిరాయల్, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిల్ కలెక్టరే.. రూ.22.73 లక్షలు కాజేశాడు

చంద్రగిరి: తిరుచానూరు పంచాయతీలో ఓ ఉద్యోగి చేతివాటాన్ని ప్రదర్శించాడు. పన్నుల రూపంలో వచ్చిన సొమ్ము ఏకంగా రూ.22.73 లక్షల ప్రజా సొమ్మును స్వాహా చేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళ్తే.. తిరుచానూరు పంచాయతీ బిల్ కలెక్టర్ రమేష్ ఏటా నివాస గృహాలు, దుకాణాలు, వాణిజ్య సముదాయాల నుంచి పన్ను వసూలు చేస్తాడు. ఈ క్రమంలో 2024–25, 2025–26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి వసూలు చేసిన రూ.22,73,192 నగదును కాజేసి దుర్వినియోగానికి పాల్పడ్డాడు. దీనిపై ఫిర్యాదులు అందడంతో గతంలో ఇక్కడ పనిచేసిన ఈఓపీఆర్డీ నేతృత్వంలో విచారణ చేపట్టారు. విచారణలో నిధులను దుర్వినియోగం చేసినట్లు తేలడంతో బిల్ కలెక్టర్ రమేష్‌ను సస్పెండ్ చేస్తున్నట్లుగా డీపీఓ సుశీలదేవి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. మూడు రోజులలోపు దుర్వినియోగానికి పాల్పడిన నగదును తిరిగి చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పంచాయతీ కేంద్రం నుంచి ఎక్కడికీ వెళ్లకూడదని, గడువులోపు నగదును చెల్లించకుంటే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అసలు సూత్రధారులపై చర్యలుంటాయా..?

తిరుచానూరు పంచాయతీ పన్ను వసూలు నగదు దుర్వినియోగంలో అసలైన సూత్రధారులపై చర్యలుంటాయా అనే అనుమానాలు వస్తున్నాయి. అయితే నిధులు దుర్వినియోగానికి పాల్పడిన సమయంలో తిరుపతి రూరల్ మండల ఈఓపీఆర్డీనే, తిరుచానూరు పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓగా పని చేసినట్లుగా తెలుస్తోంది. తిరిగి అదే అధికారి నిధుల స్వాహా ఘటనపై విచారణ చేయడం, బిల్లు కలెక్టర్ నిధులు స్వాహా చేసినట్లు జిల్లా అధికారులకు నివేదిక ఇవ్వడం గమనార్హం.

కబ్జాదారులను అరెస్టు చేయాలి

తిరుపతి రూరల్ : దళితుల భూములను కబ్జా చేసిన వారిని అరెస్టు చేయాలని కుంట్రపాకంకు చెందిన దళితులు సోమవారం తిరుపతి రూరల్ మండల తహసీల్దారు కార్యాలయం ముందు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, కుంట్రపాకం గ్రామ రెవెన్యూలో 40 సెంట్ల ప్రభుత్వ భూమిని తోటిమాన్యంగా 14 మంది దళితులకు ఇచ్చారని తెలిపారు. అందులో 20 సెంట్లు అమ్ముకోగా, మిగిలిన 20 సెంట్లు ఇతర అవసరాల కోసం వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. అయితే ఈ స్థలం పక్కనే శ్రీకర హోమ్ డెవలపర్స్ సంస్థకు చెందిన నిర్వాహకులు ఆరు ఎకరాల మేరకు వెంచర్ ఏర్పాటు చేశారని, దీనికి దారి కోసం 20 సెంట్ల ప్రభుత్వ భూమిని కాజేశారన్నారు. ఆ భూమిపై తక్షణం సర్వే చేయించి న్యాయం చేయాలని రూరల్ తహసీల్దారుకు వినతి పత్రం అందించారు.

క్లుప్తంగా

సన్మానం

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో ఎలక్షన్ విభాగంలో పనిచేస్తున్న రామకృష్ణ శివ ప్రసాద్, డీఎస్‌ఓ ఆఫీస్‌లో పనిచేస్తున్న నిత్యానంద బాబు, ఆర్‌సీ పురం తహసీల్దార్ వెంకటరమణ ఉద్యోగ విరమణ చెందారు. వీరిని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు సన్మానించారు.

ట్రే క్లీనర్ పదవీ విరమణ

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో సుదీర్ఘకాలం పాటు ట్రే క్లీనర్‌గా పనిచేసిన రామగిరి శంకర్ సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనను పోటు పేష్కార్ మునిరత్నం ఘనంగా సత్కరించారు. 30 ఏళ్ల పాటు స్వామివారికి సేవ చేయటం చాలా ఆనందంగా ఉందని శంకర్ తెలిపారు.

అభయాంజనేయ సన్నిధిలో కంచి పీఠాధిపతి



శివలింగాన్ని దర్శించుకుంటున్న కంచికామకోటి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి

రామచంద్రాపురం: మండల పరిధిలోని రాయలచెరువు కట్ట సమీపంలో వెలసిన శ్రీభవానీ జలకంఠేశ్వర అభయాంజనేయ స్వామివారిని సోమవారం రాత్రి కంచికామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

కుంటల సుందరీకరణపై సమీక్ష

తిరుపతి అర్బన్: తిరుపతి నగరంలోని పలు ట్యాంకులు(కుంటలు) సుందరీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం కలెక్టర్‌లో తిరుపతి నగరంలోని వివిధ ట్యాంకర్ల సుందరీకరణ పనుల పురోగతిపై జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్మార్ట్ సిటీలో భాగంగా వినాయక సాగర్, గొల్లవానిగుంట ఇప్పటికే అభివృద్ధి చేశారని, మిగిలిన వాటి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ ఈ వెంకటప్రసాద్, తుడా ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్రనాథ్, డీపీఓ సుశీలాదేవి పాల్గొన్నారు.

గురుకుల స్కూళ్లను తనిఖీ చేస్తా

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకోవడానికి పేద విద్యార్థులు ఎంతో ఉత్సాహం చూపుతారని.. అర్హులైన అందరికీ ప్రవేశాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా కోఆర్డినేటర్ అధికారి(డీసీఓ)పద్మజను ఆదేశించారు. జిల్లా డీసీఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆమె కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తాను త్వరలోనే స్కూళ్ల పర్యవేక్షణకు వస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు.

క్లుప్తంగా అవీ..ఇవీ..

ముగిసిన విచారణ

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ డెయిరీ టెక్నాలజీ కళాశాల దళిత ప్రొఫెసర్‌కు జరిగిన అవమానంపై వర్సిటీ అధికారులు నియమించిన కమిటీ గత నాలుగు రోజులుగా జరిగిన విచారణ సోమవారం ముగిసింది.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచండి

తిరుపతి తుడా: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెట్రోల్ అలవెన్సులు, జీతాలు పెంచాలని సోమవారం కమిషనర్‌కు యూనియన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు.

అకడమిక్ కన్సల్టెంట్లకు అన్యాయం చేయొద్దు

తిరుపతి సిటీ: ఎస్వీయూను ఎన్నో ఏళ్లుగా నమ్ముకుని పని చేస్తున్న 243 మంది అకడమిక్ కన్సల్టెంట్‌లకు ఫర్ఫార్మెన్స్ సమీక్షపేరుతో ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయడం దారుణమని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి మాధవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పుష్పయాగం రేపు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఈనెల 2న బుధవారం పుష్పయాగం జరుగనుంది.

47 వినతులు

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 47 వినతులు వచ్చాయని కమిషనర్ మౌర్య తెలిపారు. ఫోన్ ద్వారా 16 మంది తమ సమస్యలు తెలుపగా, 31 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు.

ఒకసారి రండి సార్..

తిరుపతి సిటీ: ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ డైరెక్టర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు సోమవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కలిశారు. ఈసందర్భంగా సంస్థలో వున్న అరుదైన తాళపత్రాల గురించి ఆయనకు వివరించారు. సంస్థ దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రాచుర్యం పొందిందని, ఇందులో 16 వేల తాళపత్ర గ్రంథాలు ఉన్నాయన్నారు. వాటిని తిలకించడానికి ఎస్వీయూకు రావలసిందిగా విజ్ఞప్తి చేయగా చైర్మన్ సానుకూలంగా స్పందించారు.

మీ సేవలు అమూల్యం

తిరుపతి రూరల్ : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) పరిధిలో వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ పదవీ విరమణ పొందుతున్న జనరల్ మేనేజర్ ఎస్ఎల్ అంజనీ కుమార్, సూపరింటెండింగ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మొహమ్మద్ అయూబ్ ఖాన్, పర్సనల్ ఆఫీసర్ పి.గజేంద్ర కుమార్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వీకే దశరథ రామ్‌ను ఘనంగా సత్కరించారు.

ఈఎస్ఐలో..


తిరుపతి తుడా: స్థానిక ఈఎస్ఐ ఆస్పత్రిలో స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీధర్, సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ రంగస్వామి, సీనియర్ అసిస్టెంట్ డీసీ నాగన్న పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు వారిని ఘనంగా సన్మానించి సత్కరించారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

తిరుపతి సిటీ : డాక్టర్ అంబేడ్కర్ గ్లోబల్ లా కళాశాల నిర్వహించిన మూట్ కోర్ట్ పోటీల్లో విజయం సాధించిన అభ్యర్థులకు కళాశాల చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి సోమవారం బహుమతులు ప్రదానం చేశారు.

సూర్యప్రకాష్‌కు ఉత్తమ పల్మకాలజిస్టు

తిరుపతి కల్చరల్: సూర్య మల్టీ స్పెషాలిటీ అండ్ ఎమర్జెన్సీ హాస్పిటల్ అధినేత ప్రముఖ శ్వాసకోశ వ్యాధి నిపుణుడు డాక్టర్ సూర్యప్రకాష్‌కు ప్రతిష్టాత్మకమైన ఉత్తమ వైద్య పల్మకాలజిస్ట్ అవార్డు లభించింది. ఎకనామిక్ టైమ్స్ ఆఫ్ ఇండియా వారు శనివారం ఢిల్లీలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆయనను అవార్డుతో ఘనంగా సత్కరించి అభినందించారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ సూర్యప్రకాష్











